కథానిక:

# ★ పులివేట ★

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

[ఊరిమీద పెద్దపులి విరుచుకుపడింది. తనంతటివాడు వూళ్లో వుండగా పెద్దపులి వూళ్లోకి రావడమా అని హుంకరించి వేటకు వెళ్ళాడు రిటైరయిన పోలీసాఫీసర్–రాజా... ఆ తర్వాత...]

హుయ్‌మని గాలి వీస్తోంది బయ్‌మని మోత చెవుల్లో కొడుతోంది. పెద్ద పెద్ద చెట్లు కొమ్మల్ని భయంకరంగా ఊపేస్తున్నాయి. పక్షులు పిచ పిచమని తెగ అరుస్తున్నాయి. కోతులు కొమ్మల మీదికి ఎగబాకుతూ కిచకిచమని ధ్వని చేస్తున్నాయి. ఎటు చూసినా గుండె అదిరేటట్లే వుంది.

పెద్ద చెట్టు చాటున ఒదిగి ఒదిగి కూర్చున్నాడు హరి. రాజా మాత్రం తుపాకి గురిపెట్టి నాలుగు వైపులా కలయ చూస్తున్నాడు.

చింతపల్లి అడవి మహాదట్టమయింది, ఎంతో విస్తీర్ణం కూడా వుంది. ఆ అడవిలో సంచరించని జంతువు లేదు. పగటి పూటే ధారాళంగా తిరుగుతూ వుంటాయి. అప్పుడప్పుడు గ్రామంలోకి వచ్చేసి పశువుల్ని ఎత్తుకుపోవడం కూడా కద్దు. ఈమధ్య ఓ పోస్టుమాన్ ఉత్తరాలు బట్వాడా చెయ్యడానికి వెళ్తుండగా, అమాంతం పెద్దపులి వచ్చి కబళించుకుని పోయిందిట కూడా! కాపలా ఎంతవున్నా ఏమీ ప్రయోజనం కనిపించటంలేదు. ప్రజలంతా హడలి పోతూవుంటారు, దీపాలు పెట్టటం ఆలస్యం తలుపులు బిగించుకుని ఇళ్ళలోంచి కదలరు, గజగజ లాడిపోతుంటారు.

రాజా రిటైరయిన పోలీసు ఆఫీసరు. నిండు విగ్రహం. భయంకర స్వరూపం, ఆత్మాభిమానం గల పెద్దమనిషి. ఆయనంత వ్యక్తి ఆ ఊళ్ళో ఉండగానే పెద్దపులి రావడం, పశువుల్ని ఎత్తుకుపోవటం, ప్రజల్ని హడలు కొట్టటం చెడ్డ తలవంపులుగా వుంది. పౌరుషం వచ్చేసింది. హుంకరించాడు. నేనుండగా మీకేమి భయంలేదని అభయమిచ్చాడు. వేటకు బయలుదేరాడు.

చిట్టడవి, దట్టంగా అల్లుకుపోయి, ముందుకు సాగటానికి వీల్లేకుండా వుంది. పెద్ద పెద్ద చెట్లు ఎంతో ఎత్తుగానూ, వెడల్పుగానూ ఆక్రమించుకుని, రకరకాల మృగాలకు ఆశ్రయాన్నిస్తున్నాయి. వాటన్నింటిని ఛేదించుకుని, అడవి మధ్యలోకి వెళ్ళి, వాటి మీద సవాలు చేస్తున్నాడు. రాజా ఆరితేరిన వేటగాడు. గురితప్పి ఎరగడు. ఆయన మనస్సులోకి వచ్చినతర్వాత వీటిని వధించటం, ఓ లెక్కకాదు!

చెట్ల ఆకులు గాలికి గలగలమంటున్నాయి. రాజా గుండె దడదడమంటోంది. ఎందుకనో ఆనాడు చేతులు వణకడం ప్రారంభమయినాయి. ఆయనకే ఆశ్చర్యంగా వుంది. ఎన్నో సార్లు వేటకు వెళ్లాడుగాని, యిలాంటి అనుభూతి పొందలేదు. గంభీరంగా రెండు కాళ్లు భూమి మీద గట్టిగా మోపి, తుపాకి పట్టుకుని సిద్ధంగా నిలబడ్డాడు. ఆయన కళ్ళముందరే లేళ్ళు, నక్కలు, కోతులు, సెమళ్ళు పరుగెత్తుకుంటూపోతున్నాయి. వీటితో దేన్నైనా యిట్టే, క్రింద కూల్చేవాడే. కాని ఆయన దృష్టంతా ఆ పెద్దపులిమీద వుండిపోయింది.

అవి సాధారణంగా, ఆహారం పుష్కలంగా దొరికితే వేటకోలికి పోవు. బహుశా, వీటికి ఘనంగా ఆహారం దొరికి వుంటుంది. అందుకనే, పైకి రావటం లేదు అనుకుంటున్నాడు. కాని ఏ వేళప్పుడు వస్తుందో అనే ఆరాటం లేకపోలేదు. కనురెప్పలు మూతపడనీయకుండా కాచుకు కూర్చున్నాడు. హరినికూడా జాగ్రత్తగా చూస్తూ వుండమని హెచ్చరించాడు.

హరి మహా పిరికి, గట్టిగా కోతి కిచకిచలాడితే, విలవిలలాడిపోతాడు. మెత్తగా పచ్చటి ఆకులు చేతికి తాకినాయిట, యింకేముంది పులో అంటూ పెద్ద పెట్టున అరిచాడు. నడుస్తూ తెగ ఆయాసపడిపోతున్నాడు. రాజాకు మహాకోపం వచ్చేసింది. తనంత ధైర్యస్థుడికి, యిలాంటి పిరికిఘటం, అసిస్టెంటైతే, ఇన్‌సల్టుగా వుంది. నువ్వు నాదగ్గర వుండాల్సిన వాడివి కాదు. ఇవ్వాళ్ళతో, నువ్వు, ధైర్యాన్ని తెచ్చుకుని నాదగ్గర వుండిపోవటమో, లేక శాశ్వతంగా వెళ్ళిపోవటమో తేల్చుకుంటానంటూ పట్టుపట్టి మరీ తీసుకువచ్చాడు. గజగజలాడుతూ, ప్రాణాలు బిగపట్టుకుని కూర్చున్నాడు హరి. ఎక్కడ ఏ మాత్రం చప్పుడయినా, త్రుళ్ళిపడుతూ వుంటాడు.

తల పైకెత్తి గంభీరంగా చూస్తున్నాడు రాజా. మళ్ళీ యిట్టే క్రిందకు చూశాడు. ఆయనకేదో గట్టిగా అనుమానం తగిలింది. ఏదో మృగం వస్తున్నట్టు, పట్టుగా చూస్తున్నాడు. గట్టిగా వాసన పీల్చాడు. ముక్కుదూలం కదిల్చాడు, దేన్నో పసికట్టినట్టు. మనస్సులో దృఢంగా నాటుకుపోయింది. అమాంతం, తూర్పు దిశన, పెద్ద చెట్టుమీద నుంచి, ఘోరమైన ధ్వనిచేసుకుంటూ, పక్షులన్నీ చివాలున ఎగిరిపోతున్నాయి. లేళ్ళు, చెంగు చెంగున గంతువేసుకుంటూ పరుగెత్తుతున్నాయి. ఇంకేముంది పెద్దపులి వచ్చేస్తోంది జాగ్రత్త అని హరిని హెచ్చరించాడు. పై ప్రాణాలు పైనే ఎగిరిపోయినాడు. కొంచెం దూరంలో గాండ్రింపుకూడా వినబడ్డట్టనిపించింది. హరి, హరి నామస్మరణ చేసుకుంటూ కూర్చున్నాడు. తల అటూ ఇటూ తిప్పుతూ రాజా నిశ్చలంగా నిలబడి వున్నాడు. ఇక ఏక్షణానైనా పెద్దపులి రావచ్చునే, నమ్మకం కల్గింది.

గాలి జోరుమాత్రం తగ్గలేదు. చెట్లకొమ్మలు అటూ యిటూ ఊగిసలాడుతూ, తన గురిని భగ్నపరుస్తున్నాయి. విసుగుపుట్టుతోంది. చిరాకుపడుతున్నాడు. ఎక్కడో దూరం

నుంచి చరచర వస్తున్నట్లు చెవులు నిక్కపొడిచి ఆత్రే, పరీక్షగా చూస్తున్నాడు. తీవ్రంగా ఆరాటపడుతున్నాడు ఓ నెమలి పింఛంవిప్పి నిర్భయంగా నాట్యం చేస్తోంది. అంత వెడల్పైన పింఛం చాటున ఏమున్నదీ, తెలియటంలేదు. ఒకడుగు ముందుకువేసి, నెమల్ని తప్పించాలని ప్రయత్నం చేస్తున్నాడు. ఉద్రేకం ఎక్కువయిపోయింది రాజాకు, ఆవేశం, హెచ్చిపోయింది. పట్టుదల అంతకంతె అధికమౌతోంది. అన్నిటికంటె, యెక్కువగా ఆయనకు ఆత్మవిశ్వాసం వుంది. తుపాకీ అట్లాగే చేతుల్లో పట్టుకుని లోపలికి చొచ్చుకుపోతున్నాడు. క్షణంలో ఆగాడు, కనుచూపుమేరలో ఏదో వస్తున్నట్లు స్పష్టంగా కనిపెట్టాడు. నిటారుగా నిలబడి, నిర్భయంగా చూస్తున్నాడు రాజా.

అది సామాన్యమైన మృగం కాదు, పెద్ద పెద్ద చారలు, గంభీరమైన మొహం, భయంకరంగా, సముద్ర కెరటంలాగ మీదకొచ్చి పడబోతోంది. రాజాచేతులు ఒక్కసారిగా యిట్టే వణికినాయి, ధైర్యాన్ని పుంజుకుని, కళ్లు పెద్దవి చేసుకుని సూటిగా చూస్తూ, బలంగా, కాస్తంత దూరంలో వుండగానే, గభాలున పేల్చాడు, తుపాకిగుండు, గుండెల్లోకి తగిలినట్టుంది, అమ్మో అంటూ ఆ ఆకృతి అమాంతం, భూమిమీదకు ఒరిగింది.

రాజా ఉలిక్కిపడ్డాడు. కళ్లు టపటప మనిపించాడు, ఏమీ కనిపించటంలేదు. మైకం కమ్మినట్లయింది. ఒళ్లుతూలుతోంది. మనస్సు స్తంభించింది. ఆయన హృదయంలో తీవ్రమైన ఆందోళన చెలరేగింది. ఏమిటా యీ వింత అరుపు అని ఆశ్చర్య పడిపోయాడు, మొహాన కారుతున్న చెమట్లను ఎడంచేతో గట్టిగా తుడుచుకుని, ఆయాసపడుతూ గంభీరంగా ముందుకు సాగాడు, బింకంగా అడుగులు వేసుకుంటూ దగ్గరగా వెళ్లాడు, ఒక్కసారిగా హాఠాత్తుగా నిలిచిపోయాడు.

వణికిపోతున్న కుడిచేతిని, ఎడంచేత్తో గట్టిగాపట్టుకుని, మెల్లిగా, చేత్తో తాకాడు' ఓ మనిషి, శరీరమంతా రక్తమయమయి నేలమీద చచ్చి పడివున్నాడు, అతని మొహం మీద ఆవరించుకున్న పులితోలును బలవంతంగా లాగాడు, ఒళ్లుఝల్లుమన్నది. అతని శరీరమంతా పులితోలుతోనే కప్పుకుని వుంది. అతనిచూస్తుంటే గుండె గుభేలుమంటోంది. శరీరం కొయ్యబారిపోయింది. పెదిమలు తడబడుతున్నాయి. నాలుక ఆరిపోతుంది. గుటకలువేస్తున్నాడు, భయం, ఆవేదన ఆందోళన, అతన్ని వశపరుచుకున్నాయి. ఇట్టే పిరికివాడయిపోయాడు ఆవేదనగా చూస్తున్నాడు. చప్పున వెనక్కుతిరిగి చూశాడు, హరి కనబడలేదు. ఆక్షణంలో ఏమిచెయ్యాలో తోచటంలేదు. స్తంభించినట్టయి పోయింది. అటూయిటూ బెదురుగా చూస్తూ గబగబ, ఆకుల్ని కొమల్ని పోగుచేసి, ఆమనిషి కనబడకుండా కప్పేశాడు, ఇట్టే వెనక్కువచ్చాడు, చెట్టు దగ్గర, తానుతెచ్చిన సంచీకోసం తారుమాళ్లాడాడు శరీరమంతా, చెమటతో తడిసి ముద్దయింది. చకచక యింటివైపుకు నడిచాడు.

మధ్యమధ్య వెనక్కు వెనక్కు చూస్తూ ముందుకు సాగిపోయాడు రాజా. ఇంటికిచేరేటప్పటికి, గుమ్మంలోనే, భార్య, కూతురు, నవ్వుమొహాల్తో రాజాను ఆహ్వానిస్తున్నారు. ఓమూలన, నక్కినక్కి రాజా ఏమంటాడో అని భయపడి పోతున్నాడు హరి. రాజా అయితే, ఎవ్వరివైపు చూడకుండానే, లోపలికి వెళ్లి పోతున్నాడు.

'నేనుచెప్పటంలా, హరి, పట్టిపిరికివాడు' మీరు పులినిచంపగానే, భయపడి, యింటికి పారిపోయివచ్చాడు...అయినా, ఓ మూల పులివస్తోందని తెలిసికూడా, ముందుకు వెళ్లటమేమిటండీ, ఎంతధైర్యం అయితేమాత్రం! వాడు చెపుతుంటే, నేనే వణికిచచ్చాను... 'ఏమిటి అట్లా చూస్తారు...' భార్య రాజా మొహంలోకి, ఆశ్చర్యంగా చూసింది.

రాజా అయితే, నోరుమెదపకండా లోపలికి నడిచాడు బింకంగా. చాలా పెద్దదిటగా! ...భార్యఅడిగింది.

సమాధానం ఏమీరాలేదు, తల్లీ, కూతురు, ఒకరిమొహం ఒకరుచూస్తూ, ఏమీతోచక, తమలోతాము మథనపడ్డారు.

తలుపువేసుకుని, ఒంటరిగా రాజా తీవ్రంగా వ్యథపడుతున్నాడు. కలవరపడిపోతున్నాడు, గదంతా పచార్లుచేస్తూ పిచ్చివాడయి పోతున్నాడు, తెగ తపనపడిపోతున్నాడు. ఆందోళన, ఆరాటం చెప్పటానికి వీల్లేకండావుంది. భార్య, కూతురు, మాట్లాడటానికి యింకోసారి ప్రయత్నంచేసి, విఫలమయి, ప్రయత్నాన్ని విరమించుకున్నారు. రాత్రి కంటిమీద కునుకురాలేదు, హృదయం బరువెక్కింది. రకరకాలుగా ఆలోచిస్తూ బాధపడుతున్నాడు.

భళ్లున తెల్లారేటప్పటికి, రాజా, పులిని చంపేశాడని, ఊరంతా పాక్కిపోయింది. రాజా ఉక్కిరి బిక్కిరయి పోతున్నాడు.

గతరాత్రి, వేటకువెళ్లిన మల్లయ్య యింకా తిరిగిరాలేదని, ఏమయి పోయినాడో అని ఆందోళన సన్నగా ఒకవైపునుంచి వినబడుతోంది. అతనిజాడ తెలుసుకోవటానికి వెళ్లాలని ప్రయత్నాలుకూడా జరుగుతున్నాయి. పెద్దపులి చంపేసి వుంటుందని కొందరు. మల్లయ్యను పెద్దపులి చంపినతర్వాతే, రాజా, పులిని కాల్చివుట్టాడని కొందరు. అడవిలో ఎన్ని జంతువులున్నాయోమరి, ఒక పులినిచంపగానే, సరా అని కొందరు, రకరకాలుగా, మల్లయ్యను గురించి అనుకుంటున్న మాటలన్నీ, రాజా చెవినబడుతూనే వున్నాయి, ఒక్కొక్కమాట వింటుంటే. ఒళ్లు గలతరించి పోతోంది. తీవ్రంగా క్షోభపడు తున్నాడు, ఇంట్లోవాళ్లు పిలిస్తే పలకటంలేదు. వాళ్లకు వింతగానేవుంది. ఇంట్లోంచి బైటకు వెళ్లటంలేదు. ఎవరికివారు, ఏమిటి యీవిధంగా ప్రవర్తిస్తున్నాడని అనుకుంటూ ఆశ్చర్యపడిపోతున్నారు.

గదిలో ఒంటరిగా కూర్చుని, తనలో తను తర్జన భర్జన పడిపోతున్నాడు. తీవ్రమైన సంచలనం కలిగింది. తనదృక్పథంలోనే గొప్ప మార్పువచ్చింది. వేట, క్రూరమృగం, యీ రెంటిమీద తన అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేసుకున్నాడు. తనమీద తనకే కోపం వచ్చినట్లయింది. గోడకు వ్రేలాడవేసిన తుపాకీని గభాలునతీసి నేలకేసికొట్టాడు, తనకూ తుపాకీకి ఆనాటితో సంబంధం తీరిపోయిందనుకున్నాడు. వేటాడటం మహాపాపం, ఘోరమైనహింస, క్రూరమృగమైనా, ఏదైనా

(తరువాయి 18 వ పేజీ)

## నిజానికి - నిజం

రచన : సరసు

నిజాన్ని చూచి-భయమెందుకోయ్ మిత్రం
మానవనైజానికి-ప్రతిబింబం నిజం!
నిజానికి ప్రతిరూపం-మిత్రం
తననుచూచి-సంఘం నవ్వుకొన్నా,
"క్షమార్హుడకావ"ని-దైవం తప్పుకొన్నా,
చేరదీసి క్షమించేది-మిత్రం
ఆ మిత్రునిమిత్రత్వం-నేస్తానికి స్వర్గం
నిజానికి-నిజం-నేచెప్పేది మిత్రం.

## పులి వేట

(12 వ పేజీ తరువాయి)

ఒకటే; ఒకప్రాణాన్ని తీయటం చెయ్యరాని పని, అనుకుంటూ నిర్ణయానికి వస్తున్నాడు.

ఘోరమైన పాపంచేశాను....ఇంక ఎన్నడూ కూడా యిలాంటి దారుణ కృత్యానికి పాలు పడకూడదు. నేనుచేసిన పాపానికి, కేవలం పశ్చాత్తాపం సరిపోదు. దీనికిదగిన ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. నా అంతట నేను విధించుకోవాలి...ఇక నేను జీవితంలో తుపాకి పట్టను ... ఇదేప్రాయశ్చిత్తం ... 'లోపల లోపల ఉద్రిక్తుడయి పోతున్నాడు.

అమాంతంలేచి, గభాలున తుపాకి తీసుకుని కిటికీలోంచి పవతల పారేశాడు. పెద్ద బరువుదింపేసి నట్లనిపించింది.

'నేను యింతకంటే శిక్షవిధించుకోలేను... నాకు భగవంతుడే శిక్షవిధించాలి...' కలవరపడిపోతూ గదంతా తిరుగుతున్నాడు. అక్కడ ఒక్కక్షణం వుండబుద్ధి పుట్టటంలేదు మొహం వెడల్పుచేసుకున్నాడు, కళ్లు పెద్దవి చేసుకుని, బైటకు వెళ్లటానికి ఉరుకుతూ, అమాంతం గదితలుపులు రెండూ గభాలున తెరిచాడు.

ఇద్దరు పోలీసులు, సబ్ఇన్స్పెక్టరు, గుమ్మంముందరే రాజాకోసం ఎదురుచూస్తున్నట్లు, నిలబడి వున్నారు

## ★ ప్రథమాధ్యాయమ్ ★

గతం చలిబాధతో దుప్పటీ ముసుగుపెట్టుకుని
కమ్మగా నిద్రపోతూవుంది మూడంకె వేసుకుని.
మసకచీకట్లో 'నౌబత్ పహాద్' వెలకాల దృశ్యాన్నిపోలి
మసలుతోంది భవిష్యత్తు మసగ్గా మత్తును గ్రోలి.

బరువుగా నడుస్తోంది 'ట్రైలర్ బస్' వేగంతో ఈరోజు
బాధల స్టేజీలమీంచి — తీరాగ్రౌ రెతోక అయివేజు
ఉదయాన చలిలో లేవగానే ఎదురయ్యే ప్రశ్నల బరువు
ఊరగాయ భోజనమా ? ఉల్లిసాంబారా? ఏది ఆదరువు ?

స్టౌ వెలిగించి క్షౌరానికి ముందుపొయ్యాలి నీళ్ళు
శాంతంగా గడ్డం చేసికోకపోతే ఊడివస్తాయి పేళ్ళు
బియ్యంకడిగి వ్రేళ్ళుమునిగే నీళ్లతో ఎసరు
పొయ్యగానే కుతకుత సంభాషణలు ముసురు.

గడ్డానికి పిదప రాత్రి రాసిన కాగితాల దస్తరు
అద్దాలలో ఉంచుకుని ఆనందిస్తానో మాస్తరు
విషాద సంగీతాలాపన వినిపించిచూస్తే స్టౌమీద
వేయికెరటాలువేస్తూ తెల్లని నురగలసొద.

వెలిగించుకోవాలి మళ్ళీ స్టౌ—కాగితాలు మూలనుపెట్టి
పాలికేకలు మిత్రులనుంచి—తలుపులు విరగగొట్టి
'పాకిస్తాన్' రేడియోలో ఇంగ్లీషువార్తలు సమాప్తం
పాకశాస్త్ర పారంగతుని శరీరానికి చెమట ప్రాప్తం.

ఆదరాబాదరా జలకాలాడి 'లైఫ్ బాయ్' సబ్బు నురగల్లో
ఆకాశమంతెత్తు గాలిమేడలో ప్రేయసిని కని అంటూసుహాల్లో
జుత్తులో పలితకేశదర్శనమాత్రం చేతడీలాపడి
మత్తువదల్, రెండుమెతుకులు కతికి, తలుపుకు వెడతాను గడి.

(ఒక పెళ్లైన బ్రహ్మచారి ... ట్రేడ్జీ గాథలో ప్రథమాధ్యాయమ్)

— వై. రాంబాబు